# గొడవ

మా అత్తయ్యకి లెక్కలు రావు. ఓ అయిదొందలిచ్చి ఫలానా ఫలానా వాళ్ళొస్తే యిమ్మని–తరవాత లెక్క చెప్పమంటే ఏడ్చేస్తుంది.

ఏదన్నా ఉత్తరం వస్తే చదివి పెట్టమంటుంది. అక్షర ముక్షరం కూడబలుక్కుని చదవడానికి చాలా టైమ్ పడుతుంది ఆవిడకి.

ఖాళీగా కూర్చోదు-ఎప్పుడూ చేతిలో ఏదో పని వుండాల్సిందే-అలాంటిది ఒన్న మ్మాయి పెళ్ళి చేసి కాపరానికి పంపించేశాక ఆవిడకు చెయ్యి విరగ్గొట్టుకున్నట్టుగావుంది. ఏగదిలోకి వెళ్ళినా వచ్చిన పని మరిచిపోయి అలా నిలబడిపోయి దిక్కులు చూస్తూ వుంటుంది.

మా మావయ్య ఆవిడ్ని కొట్టేవాడు. అయిందానికీ కానిదానికీ చెయ్యి చేసుకునే వాడు. చేతిలో ఏదుంటే అది మీదికి విసిరేసే వాడు. పది మంది చుట్టాలున్నా వాళ్ళందరి ఎదురుగా తిట్టేవాడు. కొట్టేవాడు. బండ బూతులు-ఆడవాళ్ళు వినగానే అసహ్యించుకునే తిట్లు తిట్టేవాడు. మళ్ళీ రామభక్తుడు. ఖద్దరు కడతాడు. కాంగ్రెసువాది. తాటాకు మంటలా ఎగిరినంత సేపు ఎగిరి చప్పున చల్లబడేది అతని కోపం. అప్పుడు మా అత్తయ్య చేతుల్ని పట్టుకుని ఏడిచే వాడు. ఇద్దరూ అలా కాస్సేపు ఏడిచేవారు. మళ్ళీ అంతలో దేనికో కోపం వచ్చేది. మళ్ళీ మామూలే! ఎవరేనా అడ్డువెళ్ళినా వెళ్ళిన వాళ్ళకు తగిలేవి దెబ్బలు. కవి మళ్ళీనూ-పెళ్ళాన్ని తన్నకుండా వుండలేడు.

నాకు మజ్జిగలో తొరకలు వస్తే చిరాకు. మజ్జిగ పోస్తున్నప్పుడు అర చేతి వేళ్ళు అడ్డుపెట్టేవాణ్ని. పాలంటే గిట్టదు. వెన్న కూడా సయించదు. పెరుగు పోసుకోలేక పోయేవాడ్ని. పుల్లమజ్జిగ అంటే యిష్టపడే వాణ్ని.

నా అలవాట్లని మార్చింది మా అత్తయ్యే. 'పోసుకో అదే బావుంటుంది' అని అన్నీ తినడం నేర్పింది. పొట్లకాయ, పెరుగు పచ్చడి. మెంతి మజ్జిగ. మజ్జిగ పులుసు, వేపుడు కూరలు నాకిష్టం. చారుకావి. ముక్కల పులుసుగాని పోసుకోలేకపోయేవాడ్ని. ఆనపకాయ, పొట్లకాయ, బీరకాయ దగ్గరకు రానిచ్చే వాడ్ని కాదు. పూటా ఆవకాయ వుండాలి. అన్నీ యిష్టపడాలి. అన్ని కూరలూ తినాలి అనేది ఆవిడ. మా అత్తయ్య పొట్టుతియ్యని పెసరపప్పుతో పెసరట్లు చాలా అద్భుతంగా వేస్తుంది. ఆవిడ పరమ శాంత స్వభావురాలు.

పెద్దపిల్ల తరవాత ఒక్క కానుపూ నిలవ లేదు, ఇల్లా పుట్టడం అల్లా పోవడం. ఇంట్లో వుయ్యాల వెయ్యలేదు. చంటి పిల్ల పారాడ లేదు. ఏటా రావడం పోవడం ఏడు కానుపులు పోయాయి. అందుకని ఆవిడ చాలా దిగులుగా వుండేది. పోయిన పిల్లలందరూ పోకుండా బావుండివుంటే వాళ్ళందరూ ఎలా వుండేవారో, ఏం చేసేవారోనని వూహిస్తూ కళ్ళనీళ్ళు పెట్టుకునేది. తరవాత యిద్దరు పిల్లలు నిలిచారు. కాని మగపిల్లాడి ముచ్చట ఆవిడకు తీరలేదు. అందుకే అల్లుళ్ళొచ్చాక వాళ్ళనే మగపిల్లలనుకుని సంతోషపడుతుంది ఆవిడ.

మళ్ళీ చేయిస్తాను, అవసరం వచ్చిందని మెళ్ళో గొలుసు అడిగిపట్టుకెళ్ళినా, కార్యం కర్మాంతరాల కోసం తనకు పసుపూ కుంకుమ కింద యిచ్చిన బంగారం లాంటి పొలం అమ్మేసినా ఆవిడ ఏమీ గొడవపెట్టలేదు. మా అత్తయ్యావాళ్ళ పుట్టింట్లో కూడా అంతా ఆడ సంతే– చివర తనూ మరో అప్ప గారూ తప్ప అంతా బాల వితంతువులే. అంతమంది అప్పగార్లూ యీవిడను అపురూపంగా చూసుకునేవారు. డబ్బా దనకం పెట్టేవారు. పురుళ్ళు పోసేవారు. పాయిలా బాయిలాకి వొచ్చేవారు.

పల్లెటూరి కొంపలు గదా - లంకంత కొంప కొబ్బరిమట్టలూ తుక్కూ దూగర-పెరడంతా శుభ్రం చేసుకునేసరికి నడుములు పడిపోయేవి. కాలవ కెళ్ళి తడి నీళ్ళు, మడి నీళ్ళు తెచ్చుకోవాలి. దొడ్లో నుయ్యి వుంది గాని ఉప్పు కషాయాలు వంటంతా కొబ్బరి మట్టలూ, కొబ్బరి డొక్కలూ వీటితోనే అయిపోవాలి. పొగ-పొగ-ఇల్లంతా పొగ-యీ పొగతో కళ్ళు రెండూ పోతాయి నాకు, అని ఆవిడ విసుక్కునేది. పల్లెటూరు. కిరసనాయిలు దీపాలు కుంపట్లో బొగ్గు లేసుకుని వంటచేసుకోవాలని ఆవిడకు సరదా.



# పురాణం సుబ్రహ్మణ్య శర్మ



పెదిపొయ్యి వంటే- నిత్యం పొయ్యి అలుక్కోవాలి. పైగా మట్టికొంపలు. నెలకి రెండు మాట్లు గదులన్నీ అలికించాలి. గచ్చు చేయించమంటే "మా యింటా వంటా లేదు - అచ్చిరాదు" అనేవాడు ఆయన. "పోనీ పడగ్గది ఒక్కటే చేయించండి" అని ఆవిడ కోరితే, "పందిరి మంచంకింద పాతు వుంది- ఆ గది తవ్వించ కూడద"నేశాడు మావయ్య. తరవాత వూళ్ళోకి ఎలక్ట్రిసిటీ వచ్చింది- స్తంభా లేశారు. దీపాలు పెట్టించమని బతిమాలింది మా అత్తయ్య. "మానాన్న ఎలక్ట్రిసిటీ ఎరగడు. మా తాత ఎరగడు మా అమ్మ ఎరగదు. నీకు కావల్సొచ్చిందా?" అని విసుక్కోవడమేగాక, నాచేత ఎవడూ ఆ పని చేయించలేడు. వీధిలోకి దీపాలొస్తే కొబ్బరి కాయలు తెంపుకు పోతారు. అసలే యీ వూరునిండా మా చెడ్డదొంగ వెధవలు అని వాదించాడు.

మా అత్తయ్య అత్తగారు అంటే మా అమ్మమ్మ పునిస్త్రీగా పోయిందట. ఆవిడ కడుషతో వున్న ఇల్లాలు. ఎవరింటికో పన్నెండోరోజు చావుభోజనానికి వెళ్ళొచ్చి పెరట్లో కాల్జారిపడి. కడుపుపోయి. గర్భ వాతంకమ్మి చవిపోయిందట. ఆవిర ఆ పడగ్గదిలో! అంటే పెద్ద గదిలో అప్పుడప్పుడు కినపడేదని అంటారు. కాని ఆవిడ అల్లాటిది కాదు మహా శాంత స్వభావురాలు. మా తాతగారికి ఆవిడ రెండో పెళ్ళి. మొదటి భార్యకో కూతురు. పెద్దావిడ పోయాక ఆ రోజుల్లో ఎవరూ పిల్ల నివ్వక పోతే- పదహారు కాసులు పెట్టి (కాసు ఎనిమిది విక్టోరియా రూపాయలు) పదిహేను వందలిచ్చి మా అమ్మమ్మను పదేళ్ళ పిల్లను కొనుక్కున్నార్ట. ఆవిడా పోయాక యీపిల్లలంతా నత్తానావా. వీళ్ళను



పెంచుకొచ్చి పెద్దవాళ్ళను చేసి పెళ్ళిళ్ళు చేసేసరికి మా తాత తలప్రాణం తోకకు వచ్చిందట. తల్లిలేని పిల్లల్ని పెంచడం మాటలా? మేనమామ భార్య మేనత్త కాదు. అంటారుగాని మా అత్తయ్య చాలా మంచిది. ఆవిడంటే మాకు చాలా యిష్టం. కాని మేమెవ్వరమూ ఆవిడ్ని దెబ్బలూ-తిట్ల బాధ నుంచి తప్పించలేకపోయాము. ఆవిడ ఎక్కడకూ వెళ్ళదు. ఆ గుమ్మం దాటి. ఎవరింట్లోనూ వుండదు.

ఓ సారి మా మావయ్య కట్టెపేడు విసిరేస్తే డొక్కలో తగిలి ముందుకు తూలి పడిపోయిందట. ఆ రోజు ఆవిడ ఏడ్చి ఏడ్చి గొడ్ల సావిట్లో కెళ్ళి ఉడీపప్పు. నల్ల మందూ నూరుకుని చచ్చిపోదామని. అంతా రడీ చేసుకుని కూచుందిట. ఇంతలో కూతుళ్ళు ముగ్గురూ జ్ఞాపకం వచ్చి వాళ్ళని ఏడిపించడానికి మనసురాక ఆ ప్రయత్నం మానుకుందట.

అలాటి మా అత్తయ్య గడపమీద కూచుని నవ్వుతోంది. ఆవిడ పెద్ద గదికి వసరాకి మధ్య మెట్లమీద కూచుని కడుపు చేత్తో పట్టుకుని పకిపడి నవ్వుతోంది. 'అహల్య... అంటోంది. ఆవిడకు-ఏదో చెప్పాలనివుంది. ఆ నవ్వులో ఆ ముక్కలు రావటంలేదు. వచ్చినా పట్టుకుని అర్థం చేసుకోవడం కష్టం. మధ్య మధ్యన పొలమారు తీసుకుంటూ దువ్వెనతో తల గోక్కుంటూ తల వారగాపెట్టి తెరలు తెరలుగా వస్తున్న నవ్వును ఆపుకుంటూ 'ఇది చూశావా ఇది చూశావా ఏం చేసిందో' అని మళ్ళీ నవ్వింది.

అహల్య మా చిట్టి మరదలు.

"ఏవిటత్తయ్యా? ఏవిటి గొడవ"? అని నవ్వుతూ అడిగాను. దానికొత్తకాపురంలో ఏవైనాగొడవలొచ్చాయేమోనని నా అనుమానం. అయినా ఇందులో నవ్వడానికేం వుంది. గొడవలొస్తే పెద్దవాళ్ళున్నారుగా సర్దడానికి-నాకు మొదట్నుంచీ పెద్ద పెద్ద కట్నాలిచ్చి పై సమ్మంధాలు చెయ్యడం యిష్టంలేదు. తీరా ఆ వచ్చే వాడెలాంటివాడో వాళ్ళవంశం వాళ్ళ పద్ధతులూ మనకు సరి పడాలికదా! మనకు సరిపడినా సరిపడక పోయినా యింత కట్నం పోసి నానాయాతనాపడి పెళ్ళి జరిపించాక పిల్లది సుఖపడాలి కదా! ఈ రోజుల్లో ఎంత ఖర్చు చేసినా ఆ గ్యారంటీ వుండటం లేదు. పై వాళ్ళు తిన్ననయిన వాళ్ళు కాకపోతే మనోళ్ళ ఆటఆడిస్తారు. అందుకే అన్నారు-"కరకులు మావాయె. కన్య మాదాయె. లబలబలు మీవాయె. రమణి మాదాయె" అని పూర్వం వాళ్ళు.

మా అత్తయ్య యింకా అలానవ్వుతూనే వుంది.

"ఎందుకత్తయ్యా అంతలా నవ్వేస్తున్నావ్?"

"యిదీ యిదీ యీఅహల్య ఏం చేసిందో చూశావా?"

'అహల్యేం చేసింది?'

'ఏం చేసిందా? అతణ్ని...అతణ్ని...ఆ భాస్కర్రావుని యీడ్చిపెట్టి లెంపకాయ కొట్టింది' అని 'దీని అఘాయిత్యం కూలా?' అంటూ దూరంగా పలుపు తాడు పేనుతున్న మా మావయ్యకేసి చూపించి 'ఈయన కున్న పౌరుషం కోపం దానికొచ్చినట్లుంది' అని మళ్ళీ నవ్వింది.

నేను షాక్కయాను.

"ఎందుకలా చేసింది అత్తయ్యా—" అని గాబరాగా అడగడం చూసి మా ఆవిడ "నేన్చెపుతాన్లెండి" అని నన్ను పక్కకు తీసికెళ్ళింది.

* * *

భాస్కరరావు గురించి నాకాట్టే తెలీదు. అతను ఒక్క సారే మాయింటికొచ్చాడు ఏదో టూర్ మీదవెళ్తూ. అప్పుడు మా పిల్లలూ అతనూ కలిసి తిరిగారు. సిగరెట్లు బాగా కాలుస్తాడు- తెగ స్మోకింగ్-ఖర్చు మనిషి. డబ్బు జల్సాగా ఖర్చుపెడతాడు. కెమెరా



ఫోటో: జి.బాబ్జీ విజయవాడ

ఎన్నాళ్ళకెన్నాళ్ళకు మళ్ళీ
దీపం వెలిగింది!
ఎప్పటికెప్పటికి చీకటి శాపం
వదిలింది!!

పిచ్చి. ఏదో వోపిచ్చి లేకుండా ఎలా వుంటుంది కుర్రాళ్ళకి? పైగా ఫ్రండ్స్.... ఫ్రండ్స్ అనగానే మిరలవాట్లని అర్థం.

మా అమ్మాయేమో పల్లెటూర్లో సంప్రదాయంలో పెరిగింది. పెరిగినా స్పోర్ట్సులో మంచి అభిలాష వుంది సైకిలు తొక్కుతుంది. అతను ఎస్సెల్సీ చేసి సైపులోయరూ. హయ్యరూ. షార్టుహాండ్ చేశాడు. అహల్య కూడా ఎస్సెసెల్సీ బాగా చేసింది. పెళ్ళికొడుకు కాస్త పీలగా వున్నా మన అమ్మాయి మాత్రం చిన్న పైల్వాన్లా వుంటుంది. చామనచాయ. పెద్ద అందగాళ్ళేం కాదు. ఇద్దరూ చురుకైనవాళ్ళే-మరి ఏమొచ్చిందో?

* * *

మా ఆవిడ్ని పట్టుకుని 'ఏం జరిగిందే?' అన్నా.

మళ్ళీ యీవిడ కూడా పగలబడి నవ్వింది.

'నవ్వకుండా చెప్పు?'

'ఆ అబ్బాయి తిన్ననైనవాడు కాదండీ?'

'ఎల్లా తెలుసు నీకు?'

"దాన్ని ఏడిపిస్తున్నాడట"

"బంగారం లాంటి పిల్లని ఏలుకోక ఏడిపించడం దేనికి?"

"చీటికి మాటికీ చెయ్యి చేసుకుంటాడట."

"ఛీఛీ! యిదేం దురలవాటు".

"ఇంకా చాలానే వున్నాయ్".

"డబ్బు ఖర్చుచేసేసి- మీ యింటికి రాసి తెప్పించమంటాడట".

"కొత్తలో అల్లుళ్ళంతా అట్లానే మావల్ని సేవింగ్స్ బ్యాంక్ అనుకుంటారు. హిస్టరీ రిపీట్స్"

"ఇంటికి ఉత్తరాలు రాయనివ్వట్టదాన్ని"

"ఇవన్నీ స్మాల్ థింగ్స్....".

"నువ్వు పల్లెటూరి దానివి నీకు మేనర్సు తెలీవు" అంటాడ్ట.

"స్నేహితుల్ని తీసుకొచ్చి వాళ్ళకు సేవలు చెయ్యమంటాడ్ట-"

"సేవలంటే...."

"మళ్ళీ ఎక్కడా అనకండి. స్నేహితుల్ని తీసుకొచ్చి వాళ్ళు పడుకునే మంచం మీద కూర్చోపెడ్తాడ్ట-"

"సర్లె-యిదిగొడవ చేసింది అవునా?"

"ఆ దుష్టుల్లా ఉళ్ళూనాపి. ఆ వెధవల్ని కూర్చోపెట్టకండి నాకిష్టంలేదు అందిట".

"వెధవలని అంటున్నావా? అది అందా?"

"ఏమో గొడవ - అంతేనా?"

"అంతేనా అంటే యింకావుంది. బుడ్లు తెచ్చి ఇంట్లో పార్టీ లిస్తాడ్ట - వెధవ్వేషాలు?"

ప్రకటనకర్తలు
రచయితలు
రచయిత్రులు
కవులు
కళాకారులు
ఏజంటు
మహాశయులు
చిత్రకారులు
- కార్టూనిస్టులు
పాఠకలోకానికి
అందరికీ
ఆంధ్రజ్యోతి
సచిత్రవారపత్రిక
(1984
దీపావళి
ప్రత్యేక సంచిక)
దీపావళి
శుభాకాంక్షలు


"ఏదో ఏడుస్తాడు పోనీ."

"పోనీ కాదండి. వాళ్ళకి టిఫిన్లు. ఫలహారాలు. ఆపైన భోయనాలూ-అదిది చస్తుందిటండీ!"

"బయటకెళ్ళి ఏడవమంటే సరి!"

"వాళ్ళని ఇంట్రొడ్యూస్ చేస్తే వాళ్ళతో మాట్లాడాలిట-మాట్లాడక పోతే అల్లరీ-"

"బావుంది-ఇంతేనా."



"ఇంకా వుంది అది చిన్న వాటా! ఓ చిన్నవంటగది! ఓ గది ముందు వరండా-ఎవళ్ళేనా వస్తే దీనికి జైలు. ఆగసులు పెట్టె లాంటి యింట్లో పరాయి మగాళ్ళ మధ్య యిది ఎలా తిరుగుతుంది! అలా వంట గదిలో నిలబడిపోయి వాళ్ళకు అన్నీ సప్లయిలు చేస్తూ వుండాలి. చిన్నపిల్ల-దానికి కష్టంగా వుండదూ!"

"గట్టి చిక్కే-"

"తాగాక. వాళ్ళ పాటలూ. పద్యాలూ ఆనకులూ చెవాకులూ ఒకటే గోలట!"

'వాళ్ళు తను లేనప్పుడు వచ్చినా కూచో పెట్టి కాఫీ లివ్వాలి! అది మర్యాదట. ఇట్లో లేరని చెప్పి తలుపేసుకుంటే అదో పేచీ-కొట్టడం, తిట్టడం."

'బావుందే-ఈ పెళ్ళి కొడుకు స్నేహితులు ఎక్కడ చూసినా పెద్ద న్యూసెన్స్‌గా తయారయాను.'

"అంతే కాదు దీన్ని కూడా పుచ్చుకోమంటాడ్ట బావుంటుందీ హుషారుగా వుంటుందీ అని బలవంతం చేస్తాడ్ట"

"పుచ్చుకుందా?"

"వాళ్లు నొప్పులూ ఆవీపోతాయంటే పుచ్చుకుందిట. భళ్ళున వాంతయిందట. ఆ సీసా తీసికెళ్ళి చెత్తకుండీలో గిరాటేసిందట"

"బావుంది-తరవాత"

"అందరీన్నిపలకరించి మాట్లాడ్డం మొదలెట్టిందట. యీ గొడవవెందుకని"

"సర్లే మరి ఏంచేస్తుంది. చిన్నపిల్ల పాపం దానికి తల్లి తండ్రి జ్ఞాపకానికొచ్చి బెంగగా కూడా వుండాలి. ప్చ్!!"

"అందరూ ఓలా వుండరు. ఓ సారి యితను వూళ్ళో లేనప్పుడు వో ఫ్రంట్ గాడొచ్చి కాఫీలు తాగి, టిఫిన్లుచేసి, కబుర్లు మొదలెట్టాడ్ట. ఇది వూరుకుంది. మళ్ళీ మళ్ళీ రావడం మొదలెట్టాడ్ట- యితనులేనప్పుడు".

"బావుంది వెధవ్వేషాలు. అప్పుడేం చేసింది?"

"ఏమీచెయ్యాలా- వూరుకుంది. ఎగదీస్తే బ్రహ్మహత్య. దిగదీస్తే గోహత్య"

"అతన్తో చెప్పాల్సింది యిలా వస్తున్నాడు అని."

"ఇతను సజావయిన రకం కాదని వూరుకుంది."

"అదే పొరపాటు—"

"ఆడదానికి అన్నీ అగ్నిపరీక్షలే- ఓ రోజు యితను తాగొచ్చి నీకూ వాడికీ ఏమిటి సంబంధం-వాడెన్దుకు రానిస్తున్నావ్? వాడితో నీకు కబుర్లేవిటి అని దీన్ని నానా మాటలూ అన్నాడ్ట-"

"అయ్యో పాపం"

"అని చెయ్యెత్తాడ్ట-"

"అరరె రామ రామ"

"ఆ ఎత్తిన చేతిని మెలి తిప్పి చాచి పెట్టి కొట్టిందట ఒకటి"

"ఏమిటి అహల్యే!"

"అహల్యే లెంపకాయ".

"అవును లెంపకాయ".

"అతను లేచి మళ్ళీ కొట్టడానికి వస్తే ఒక్కతోపు తోసిందిట- గోడకెళ్ళికొట్టుకుని వెల్లకిలాపడ్డాడ్ట కళ్ళు బైర్లుకమ్మి నక్షత్రాలు కనిపించాయిట. ఇందుగుండు సామాన్లు, గ్లాసులూ, బూతుపుస్తకాలూ అన్నీ విసిరేసిందిట వీధిలోకి."

"నరకాసురవధ! మహిషాసురమర్దనీ మీ చెల్లెలు-"

"అతను దాని చేతులు పట్టుకుని ఏడ్చేశాడ్ట- యిదీ దాని అరచేతుల్ని చూసుకుంటూ ఏడ్చేసిందట."

"యిద్దరికీ కాంప్రమయిజేషన్ వచ్చేసిందంటావ్—'

"అదండీ గొడవ-"

ఇప్పుడు మా అత్తగారు అంతలా ఎందుకు నవ్విందో నాకర్థమయింది. అహల్య తరతరాల బాకీని తీర్చింది. ఈసారి అహల్య వచ్చినపుడు దానికో పట్టుచీర పెట్టాలి!



చిత్రం: హరిప్రసాద్